# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

### పత్రికా ప్రకటన

**జూలై 31, 2013**

## ప్రత్యేక రాష్ట్రాన్ని పోరాడి సాధించుకున్న తెలంగాణ ప్రజలకు విప్లవాభినందనలు

ప్రత్యేక రాష్ట్రం కావాలనే తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్ష ప్రాథమికంగా నెరవేరింది. ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం, వెలకట్టలేని త్యాగాలతో తమ ఆకాంక్షను నెరవేర్చుకున్న తెలంగాణ ప్రజలకు మా పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, ప్రజా విముక్తి గెరిల్లా సేన, విప్లవ ప్రజా సంఘాలు, క్రాంతికారీ జనతన సర్కార్లు, యావత్ దండకారణ్య ప్రజానీకం సగర్వంగా లాల్‌సలాం తెలియజేస్తున్నారు. నేడు తెలంగాణ వ్యాపితంగా వెల్లువెత్తిన సంబరాల్లో పాలుపంచుకుంటున్నారు. ఈ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరులందరినీ స్మరించుకుంటున్నారు. ఈ పోరాటానికి నాయకత్వం వహించిన ప్రజా సంఘాలకు, సంఘీభావాన్ని ఇచ్చిన కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజానీకానికి అభినందనలు తెలియజేస్తున్నారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది మేమేనని కాంగ్రెస్ పార్టీ, తమ పోరాటం వల్లనే వచ్చిందని తెలంగాణ రాష్ట్ర సమితి, తమ మద్దతే కీలకమని భారతీయ జనతా పార్టీ, తదితర పార్లమెంటరీ పార్టీలన్నీ ఈ విజయాన్ని తమకు ఆపాదించుకోవడానికి పోటీ పడతాయి. కాని ప్రజల పోరాటశక్తి వల్ల, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఇంకెంత మాత్రం వాయిదా వేయలేని ఒక అనివార్య పరిస్థితికి తలవొంచి మాత్రమే నేడు కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రకటించింది. ఇలా కాంగ్రెస్ పార్టీ మెడలు వంచిన ఘనత ముమ్మాటికీ తెలంగాణ ప్రజలదే. సుసంపన్నమైన, వీరోచితమైన పోరాట సాంప్రదాయాన్ని కలిగి వున్న తెలంగాణ ప్రజలు తమ ఆకాంక్షను నెరవేర్చుకోవడానికి సుదీర్ఘ కాలంగా పోరాడుతూ, ప్రాణ త్యాగాలు చేస్తూ, నమ్మకద్రోహాల నుండి గుణపాఠాలు నేర్చుకుంటూ చివరకు ఈ విజయాన్ని సాధించుకున్నారు. అలా ప్రజలే చరిత్ర నిర్మాతలనే సత్యాన్ని తెలంగాణ ప్రజలు మరోసారి రుజువు చేశారు.

ప్రత్యేక రాష్ట్రం కావాలనే తెలంగాణ ప్రజల ఆకాంక్షను మా పార్టీ మొదటి నుండి దృఢంగా సమర్థించింది. పోరాడుతున్న ప్రజలకు నాయకత్వం అందించింది. 1969లో ప్రత్యేక తెలంగాణ వుద్యమం తీవ్ర అణచివేతకు గురైన తర్వాత, తిరిగి 1996లో ఉద్యమాన్ని ప్రారంభించడంలో మా పార్టీ కృషి ప్రధానమైనది. కోస్తాంధ్ర, రాయలసీమ పెట్టుబడిదారులకూ, దోపిడీ వర్గాలకు కొమ్ము కాస్తూ, ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్ష పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఖరిని ఎప్పటికప్పుడు ఎండగట్టింది. ప్రత్యేక తెలంగాణా వుద్యమంపై తెలుగుదేశం పార్టీ తన పాలనా కాలంలో కొనసాగించిన తీవ్ర అణచివేతను, ఆ తర్వాత అది చేసిన అన్ని రకాల మోసాలను, కుట్రలను ఎదిరించింది. పోరాటాలతో కాకుండా కేవలం లాబీయింగ్‌తోనే తెలంగాణను సాధించవచ్చని తెలంగాణ రాష్ట్ర సమితి ప్రజల్లో కల్పిస్తున్న భ్రమలను పటాపంచలు చేసింది. రకరకాల కుతర్కాలతో తెలంగాణ వుద్యమాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన రివిజనిస్టు పార్టీల దివాళాకోరు రాజకీయాలను విమర్శించింది. ఈ క్రమంలో మా పార్టీ తీవ్ర నిర్బంధానికి గురైంది. కొందరు విలువైన కార్యకర్తలను కోల్పోయింది. అయినప్పటికీ తెలంగాణ ప్రజలకు నాయకత్వం అందించడానికి శాయశక్తులా కృషి చేస్తూ వచ్చింది.

సాధించుకున్న ఈ విజయం ప్రేరణతో ప్రజలు ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని మా పార్టీ ఆకాంక్షిస్తున్నది. ఇంకెంత మాత్రమూ కాలయాపన చేయకుండా, వెంటనే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడం కోసం పోరాడాలి. తెలంగాణ ప్రజలకు లెక్కలేనన్ని సార్లు విద్రోహానికి, వంచనకు బలైన చరిత్ర వుంది కనుక మరోసారి అలా జరగకుండా అప్రమత్తంగా వుండాలి. అంతేకాదు ఎన్నో పోరాటాల ఫలితంగా ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ తదితర ప్రాంతాలు ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడినప్పటికీ, అక్కడ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలేవీ నెరవేరలేదు. ఈ చేదు ఉదాహరణల నుండి తెలంగాణ ప్రజలు గుణపాఠాలు తీసుకొని, నేడు ఏర్పడబోయే తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజాస్వామిక తెలంగాణగా మార్చుకోవడం కోసం తమ పోరాటాన్ని నిరంతరం కొనసాగించవల్సే వుంది. ఇక ఇన్నాళ్లూ తెలంగాణను, ఇక్కడి ప్రకృతి వనరులను ఇష్టం వచ్చినట్టుగా దోచుకున్న దేశీయ, విదేశీయ పెట్టుబడిదారుల దోపిడీకి, ఈ దోపిడీకి మరింతగా దారులు సుగమం చేసే నూతన ఆర్థిక

విధానాలకు వ్యతిరేకంగా రాజీ లేకుండా పోరాడాల్సి వుంది. భాకపా (మావోయిస్టు) నాయకత్వంలో తెలంగాణ ప్రజలు భూస్వామ్యవర్గాలకు వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న పదుల వేల ఎకరాల భూములను ప్రభుత్వ అణచివేత విధానాల మూలంగా ప్రజలు సాగులోకి తెచ్చుకోలేకపోతున్నారు. మరెన్నో చోట్ల రైతుల నుండి, ముఖ్యంగా ఆదివాసుల నుండి, దళితుల నుండి భూములను గుంజుకొనే ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారు. అలా ఇప్పటికీ భూమి సమస్య తెలంగాణ ప్రజల జీవన్మరణ సమస్యగానే వుంది. కనుక నేడు ఏర్పడే తెలంగాణాలో వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని చురుకుగా కొనసాగించాల్సిన అవసరం వుంది.

కొత్తగా ఏర్పడే తెలంగాణ రాష్ట్రంలో ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కారం కావనేది స్పష్టం. ఎందుకంటే నేడక్కడ అధికారంలోకి రాబోయేది దోపిడీ శక్తులే. మౌలిక సమస్యల పరిష్కారం కోసం నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా పీడిత ప్రజల రాజ్యాధికారాన్ని సాధించుకోవడం తప్ప మరో మార్గం లేదు. కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో మొదలై తెలంగాణా అంతటా విస్తరించిన విప్లవోద్యమమే దండకారణ్యంలో నేడు విముక్తి ప్రాంత లక్ష్యంతో కొనసాగుతున్న ప్రజాయుద్ధానికి ప్రేరణ, పునాది అనేది అందరికీ తెలిసినదే. దండకారణ్య వుద్యమానికి తొలి నుంచీ తెలంగాణ పీడిత ప్రజానీకం అండగా నిలబడింది. మరోవైపు తెలంగాణా ప్రజల ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి దండకారణ్య విప్లవోద్యమం, ఇక్కడి ప్రజల ప్రజాస్వామ్య అధికార సంస్థయైన 'క్రాంతికారీ జనతన సర్కార్' మద్దతుగా నిలిచాయి. ప్రత్యేక తెలంగాణ వుద్యమంపై అణచివేతకు పూనుకున్న పోలీసు వ్యవస్థ (ప్రత్యేకించి గ్రేహౌండ్స్, ఎస్ఐబీలు) దండకారణ్య వుద్యమంపై కూడ పాశవిక దాడులకు దిగుతున్నది. దీని విప్లవ ప్రతీఘాతుకత్వానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగించేందుకు ప్రజలంతా సంసిద్ధం కావాలి. తెలంగాణా ప్రజలు నేడు సాధించుకున్న ఈ విజయం స్ఫూర్తితో నూతన ప్రజాస్వామిక విప్లవంలో మరింతగా చురుకుగా ముందుకు సాగాలని, దండకారణ్యంతో సహా దేశంలోని పలు ప్రాంతాల్లో సాగుతున్న ప్రజాయుద్ధంతో భుజం భుజం కలిపి నడవాలని మా పార్టీ పిలుపిస్తున్నది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నేపథ్యంలో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు, వ్యతిరేక ఆందోళనలు చేపట్టడానికి స్వార్థ రాజకీయ శక్తులు, దోపిడీ వర్గాలు అనేక ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ప్రయత్నాలను దృఢంగా తిప్పికొట్టి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంపూర్ణమైన మద్దతునిచ్చి, తమ సౌభ్రాతృత్వాన్ని చాటుకోవాలని మా పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజానీకానికి, ప్రజాస్వామికవాదులకు విజ్ఞప్తి చేస్తున్నది.

ఇదే సందర్భంగా, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న తెలంగాణా ప్రజల పోరాట స్ఫూర్తితో విదర్భ, గూర్ఖాలాండ్ తదితర ప్రాంతాల ప్రజలు తమ తమ ప్రాంతాల్లో ప్రత్యేక రాష్ట్ర వుద్యమాలను కొనసాగిస్తారని, తీవ్రతరం చేస్తారని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఆశిస్తున్నది.

**రామన్న**

**కార్యదర్శి**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**